క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అశోక్ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. అశోక్ నగర్, పత్తేబాద, మంచినీళ్లతోట, చైత్ర హాస్పిటల్ రోడ్డు, మోతేవారితోట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- పెదవేగి మండలం కొప్పాక సబ్‌స్టేషన్ పరిధిలో కొప్పాక, అంకన్నగూడెం, కొప్పాకగూడెం, అమ్మపాలెం, పెదకడిమి, పినకడిమి, దుగ్గిరాల గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ త్రీఫేజ్, 1 ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- లక్ష్మీపురం ఫీడర్ పరిధిలో కండక్టర్ వర్క్ కారణంగా లక్ష్మీపురం వ్యవసాయ ఫీడర్, పెదవేగి 24 గంటల లైను వెళ్లే ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

గణపవరం: గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌లో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 75 మంది గర్భిణులకు కిరణ్మయి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రమే పురుడు పోసుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలు, కాల్షియం టాబ్లెట్లు వాడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని గురువారం సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన సమయంలో టీడీపీ కార్యకర్తలను అణగదొక్కిన నానిని పార్టీలోకి తీసుకుంటే సహించేది లేదంటూ గత కొంతకాలంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా పోస్టులు పెట్టారు. నాని చేరికను వ్యతిరేకిస్తూ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు విలేకరుల సమావేశాలు పెట్టి మరీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా, వారిని అవమానిస్తూ పార్టీ అధినాయక్వం నానిని పార్టీలో చేర్చుకోవడంతో నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. నాని పార్టీలో చేరిన సమయంలో ఆయన వెంట ఎమ్మెల్యే బడేటి చంటి, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- కల్తీ ఆహార పదార్థాలు, నిల్వ మాంసాల విక్రయం
- రెస్టారెంట్ ఆహారంలో బొద్దింకలు, పురుగులు దర్శనం
- ఆహార ప్రియుల్లో భయాందోళన





నగరంలోని ఒక ప్రాంతంలో వేలాడదీసిన చికెన్ జాయింట్లు , ఒక రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆహార అవసరాలు తీర్చడానికి రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసుకోవడం, ఉద్యోగాల నుంచి వచ్చి వంట చేసుకునే ఓపికలేక హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి తమకు కావాల్సిన ఆహారాన్ని తెచ్చుకోవడం లేదంటే.. స్విగ్గి, జమోటో వంటివాటిలో ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేయడం ఈ రోజుల్లో ఎక్కువైంది. ఇదే అదునుగా వ్యాపారులు కల్తీ ఆహారం, నిల్వ ఉంచిన ఆహారాన్ని వినియోగదారులకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, హోటళ్లు ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఆహార పదార్థాల తయారీకి టేస్టింగ్ సాల్ట్ (చైనా సాల్ట్)ను వినియోగించకూడదు. రోజువారీగా వినియోగించే ఉప్పును మాత్రమే వాడాలి. ఈ నిబంధనలను హోటళ్ల, రెస్టారెంట్ల యాజమాన్యాలు పాటించడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వంట వండే వ్యక్తి వడ్డించే వ్యక్తులకు సంబంధిత హోటల్ యజమాని డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ఎక్కువ శాతం వంట మేస్త్రీలకు ఈ సర్టిఫికెట్ ఉండడంలేదని తెలుస్తోంది.

కాల్వలు, చెత్త కుప్పల పక్కనే ఇక్రయం

ఏలూరు నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో కనీసం 100 అడుగులకు ఒక బిర్యానీ పాయింట్ దర్శనమిస్తోంది. వీటికి తోడు మొబైల్ బిర్యానీ పాయింట్లు, రోడ్డు పక్కనే విక్రయించే చిరువ్యాపారులు కూడా ఎక్కువయ్యారు. అయితే పెద్ద హోటళ్లు, కొన్ని రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించడం లేదని, మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారని, మిగిలిన మాంసం సైతం ఇదే విధంగా ఫ్రిజ్‌లో ఉంచి వండుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆయా రెస్టారెంట్లు, హోటళ్లలో కల్తీ నూనె, కల్తీ మాంసం, కల్తీ ఆహార పదార్థాలతో మటన్, చికెన్ బిర్యానీ తయారు చేసి విక్రయిస్తున్నారు. చిన్నా, పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, చాట్, నూడుల్స్ షాపులన్నీ కలుపుకొని ఏలూరు నియోజకవర్గంలో 100కు పైగా ఉన్నాయి. వీటిలో ఏటా రూ.కోట్ల వ్యాపారం నిర్వహిస్తారు. అధికశాతం మురుగు నీటి కాలువలు, చెత్త కుప్పల పక్కనే వీటిని నిర్వహిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు.

నాణ్యతకు నీళ్లు

అనేకచోట్ల చనిపోయిన కోళ్లు, మేకలతో పాటు కుళ్లిపోయిన కూరగాయలు, ఒడిలి, ఎండిపోయిన ఆకు కూరలను తక్కువ ధరకు కొనుగోలు చేసి వంటకాల్లో వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది. చాలాచోట్ల కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రంగులు కలుపుతూ క్యాన్సర్, గుండె జబ్బుల వంటి రోగాలకు కారణమవుతున్నారు. మరి కొందరు హోటల్ నిర్వాహకులు తక్కువ ధరకు వస్తుందని కల్తీ నూనెలతో వంటలు చేసి ప్రజలకు అంటగడుతున్నారు.

ఆహార సలహా సంఘం జాడేదీ

గతంలో నియోజకవర్గంలో ఆహార సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఆ సంఘం ఎక్కడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. సమాజంపై కొంత అవగాహన ఉన్న సామాజిక కార్యకర్తలను ఈ సంఘాల్లో సభ్యులుగా నియమించారు. వారు సైతం రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు భయపడి కల్తీ ఆహారం తయారు చేస్తున్న వారిని ప్రశ్నించడం లేదు.

తనిఖీలు చేయాలి



నాసిరకం వస్తువులతో చిరుతిళ్లు తయారు చేస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి, కల్తీ ఆహారాన్ని అరికట్టాలి. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. ఆహారాన్ని వండే సమయంలో వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ సంబంధిత వ్యాధులు, అల్సర్లు వచ్చే అవకాశం ఉంది.

– గొంతిన రామకృష్ణ, సామాజిక కార్యకర్త

దాడులు నిర్వహిస్తున్నాం



నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నాం. విజిలెన్స్‌తో పాటు ఆహార నియంత్రణ, తూనికలు, కొలతల శాఖ అధికారులను కూడా ఈ దాడుల్లో భాగస్వాములను చేస్తున్నాం. కల్తీ, నిల్వ ఆహార పదార్థాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తాం. ప్రజల ఆరోగ్యానికి నష్టం చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– వి.శ్రీరాంబాబు, రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

ఆధ్యాత్మిక ప్రవచనం, హరికథా కాలక్షేపం



ప్రవచనం చేస్తున్న వద్దిపర్తి పద్మాకర్



హరికథా కాలక్షేపం చేస్తున్న సప్పా భారతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం నిర్వహించారు. సాయంత్రం నగరానికి చెందిన త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నగరానికి చెందిన సప్పా భారతి బాగవతారిణి నర్తనశాల అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. అర్చకులు దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కెమిస్ట్రీ కెరీర్ అవకాశాలపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కెమిస్ట్రీ సబ్జెక్టుతో కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం శాంత కుమారి అన్నారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాల రసాయన శాస్త్ర, అలుమిని, ఐక్యూసీ విభాగాల ఆధ్వర్యంలో గురువారం కెమిస్ట్రీ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి శాంత కుమారి మాట్లాడుతూ కెమిస్ట్రీ డిగ్రీ పొందిన తరువాత ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, అయితే పదోన్నతుల కోసం పీజీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. పీజీ తరువాత బోధనా రంగంలో అవకాశాలు ఉంటాయని, రీసెర్చ్‌లో సీఎస్ఐఆర్, నెట్ క్వాలిఫై అయితే స్టైఫండ్‌తో పీహెచ్‌డీ చేసుకోవచ్చని వివరించారు. వీటితో పాటు పరిశ్రమల్లో కూడా అవకాశాలు లభిస్తాయని, కెమిస్ట్రీ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించాలని సూచించారు. తొలుత కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ మాట్లాడుతూ కంప్యూటర్‌తో మాత్రమే భవిష్యత్ లేదని ప్యూర్ సైన్సెస్‌కు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, కెమిస్ట్రీ హెచ్‌వోడీ తులసి కోటేశ్వరిబాయి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆపదలో అపరాల రైతులు

- మినుము, పెసర పంటలకు తెగుళ్లు
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- స్పందించని అధికారులు



తెగులు సోకిన అపరాల పైరు

పెదవేగి : మినుము, పెసర పంటలను తెగుళ్లు ఆశించాయి. ఆదాయం సంగతి ఎలా ఉన్నా పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొంది. దెందులూరు నియోజకవర్గం పెదపాడు, ఏలూరు, దెందులూరు మండలాల పరిధిలో కృష్ణాడెల్టా ఆయకట్టు 58 వేల ఎకరాల భూమి ఉంది. గత అనేక ఏళ్లుగా రబీ సాగుకు నీరు ఇవ్వడంలేదు. ఖరీఫ్‌కు కూడా నీరందే పరిస్థితి లేదు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణాడెల్టాను సస్యశ్యామలం చేస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించినా.. ఆచరణలో పూర్తి ఆయకట్టుకు నీరు ఇవ్వలేక పోయింది. పెదపాడు మండలంలో దాదాపు 25 వేల ఎకరాలకు నీరు అందడంలేదు.

అపరాలపైనే ఆశ

మినుము, పెసర పంటలపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ పంటలను తామర పురుగు ద్వారా మొవ్వకుళ్లు తెగులు ఆశించింది. ఈ తెగులు నివారణకు ఇప్పటికి ఏడెనిమిది సార్లు పురుగు మందులు పిచికారీ చేశారు. పంట కాల్వలో నీరులేక ఆటోల్లో డ్రమ్ముల ద్వారా నీరు తెచ్చి పురుగు మందులు పిచికారీ చేశారు. ఇందుకు ఎకరాకు రూ.10 వేలకు పైగా రైతులకు ఖర్చు చేశారు. అయినా తెగుళ్ల నివారణ కాలేదు. ఎకరానికి ఇప్పటి వరకు రూ.30 వేలు నుంచి రూ.35,000 వరకు రైతులు ఖర్చు చేశారు. రానున్న 10 రోజుల్లో పంట కోతలు ప్రారంభమవుతాయని, ఏడు నుంచి 8 క్వింటాళ్లు రావాల్సిన పంట దిగుబడి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లకు పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా డెల్టా రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్‌ను ప్రశ్నించగా పెదపాడు మండలంలో ఎక్కువగా ఉన్న అపరాల సాగులో బంగారు తీగ కలుపు వేధిస్తుందన్నారు. అధికారుల సలహాలతో కొత్తరకం విత్తనాలు సేకరించి రైతులు వాడితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటలు కొనాలి. తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. అపరాల రైతులకు పెట్టుబడుల సాయం అందించాలి. విత్తనాలు ఎరువులు, పురుగు మందులు ఉచితంగా అందించాలి. లేకుంటే ఆందోళనలు చేపడతాం.

– కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, కౌలు రైతు సంఘం

ఏటేటా నష్టాలే !



నాణ్యమైన పెసర, మినుము విత్తనాలు అందుబాటులో లేక పోవడం, వాతావరణ మార్పులతో తెగుళ్లు ఆశించి ఏటేటా నష్టపోతున్నాం. ఇదే కొనసాగితే భూములు అమ్ము కోవడం తప్పా మారో మార్గం లేదు. పంటలను తెగుళ్లు ఆశించిన సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు లేదా అధికార్లు స్పందించక పోవడం, తగిన సూచనలు ఇవ్వక పోవడం బాధాకరం.

– లింగం కృష్ణారావు, రైతు, పెదపాడు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	28
వంకాయలు (కాంతులు)	16	చామదుంపలు	44-48
వంకాయలు (తెలుపు)	16	ములక్కాడలు	10, 15
బెండకాయలు	36	కంద	72
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	32
కాకర కాయలు	32	కీరా దోస	40-44
బీరకాయలు	00	ఫ్రెంచ్‌బీన్స్	60-72
కాలీఫ్లవర్	00	అల్లం	50
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	32	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07-10
గోరుచిక్కుడు	28	పుదీనా	05
దోసకాయలు	24-34	బఠాణీ	--
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	19
ఏలూరు - తిరుపతి(ఇంద్ర) నాన్ ఏసీ	16.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	00

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పర్యటన



రాధయ్యతో మాట్లాడుతున్న బాలరాజు

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు యాండ్రప్రగడ రాధయ్య ఇంటికి వెళ్లి కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. అదే విధంగా ఆయన ఆరోగ్య స్థితిగతులను కూడా అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన యాండ్రప్రగడ భూసియ్య సతీమణి శ్యామలావతి ఇటీవల మృతి చెందారు. అక్కడికి కూడా వెళ్లి శ్యామలావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షులు కలగర నాని పాల్గొన్నారు.

వారి ఉద్యమం స్ఫూర్తిదాయకం

ఏలూరు (టూటౌన్): ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ అభివృద్ధికి, సీపీఐ నిర్మాణానికి మద్రాపు సత్యనారాయణ, వంకినేని శ్రీశైల మల్లికార్జునుడుల చేసిన ఉద్యమం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. ఏలూరు కొత్తపేట ఫ్రెండ్స్ సర్కిల్ సెంటర్లో గురువారం ఉదయం వారి వర్ధంతి కార్యక్రమం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యనారాయణ, మల్లికార్జునుడు సేవలను కొనియాడారు.

విద్యతోనే అభివృద్ధి

దెందులూరు : విద్యతోనే అభివృద్ధి అవగాహన ముడిపడి ఉందని ఆకుల నరసింహారావు ఉమాలక్ష్మి ట్రస్ట్ అధినేత ఎన్ఆర్ఐ ఆకుల శ్రీధర్ అన్నారు. గురువారం దెందులూరు ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఎస్ అపర్ణకు రూ.2000, వై.లావణ్యకు రూ.1500 అందజేశారు. హెచ్ఎం శ్రీదేవి సంపెంగ వెంకట లక్ష్మి, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం వెంకటాద్రి, గ్రంథపాలకులు గుల్లపూడి వెంకటేశ్వరరావు ఉన్నారు.

స్టేజీ నిర్మాణం ప్రారంభం

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో ఆకుల నర్సింహారావు, ఉమాదేవి చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయం రూ.లక్షతో స్టేజీ నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు. శనివారం నాటికి స్టేజీ పనులు పూర్తవుతాయని హెచ్ఎం మల్లికార్జునరావు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

పెదవేగి : మత్తు పదార్థాలు, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ ప్రజలకు సూచించారు. ఓరల్, మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ శనివారపేట నుంచి దుగ్గిరాల దంత వైద్య కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ధూమపానం, మద్యపానం, జంక్ ఫుడ్ వంటి వాటి వల్ల చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని వివరించారు. ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగం హెచ్‌డీ వీఆర్ చంద్రబాబు, కరస్పాండెంట్, సెక్రటరీ జి.మోజెస్, ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు, డాక్టర్లు ప్రవీణ్, శ్రీకాంత్, గౌత, విద్యార్థులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



అబాకస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

దెందులూరు: అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో దెందులూరు సెయింట్ మెరిస్ యూపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బి.వేదాక్షిత ప్రియ రాష్ట్ర స్థాయిలో ప్రథమ, కె.సత్యసాయిబాబు, కె.పవన్‌సాయి జిల్లా స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విశ్వం ఎడ్యుటెక్ విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు తామందుకున్న ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను ప్రదర్శించారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

గణపవరం: ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంతో సబ్సిడీపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవచ్చునని ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో సూర్యగర్ యోజనపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్‌తో డబ్బు ఆదాతోపాటు, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో పాటు, బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. డీఈఈ, ఏఈ, డీఆర్‌డీఏ ఏపీఎం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి శిక్షణ దోహదం



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు శిక్షణ తరగతులు దోహద పడతాయని ఐసీడీఎస్ పీఓ షాహనాజ్‌బేగం, పూళ్ల సెక్టార్ సూపర్‌వైజర్, రిసోర్స్‌పర్సన్ నూర్జహాన్ బేగంలు అన్నారు. భీమడోలు, గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోషణ్ బీ, పడాయి బీపై అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ ప్రేరణ, ప్రారంభ బాల్య సంరక్షణ విద్య, పాఠ్యాంశాల అంశాల బోధనా విధానాలపై అవగాహన కల్పిస్తున్నామని షాహనాజ్‌బేగం, నూర్జహాన్ బేగంలు తెలిపారు. ప్రీ స్కూలు చిన్నారుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు అవసరమైన మెలకువలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధనతో పాటు లబ్ధిదారులకు సేవలను అందించే విషయంలో అలసత్వం వహిస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. పోషణ వాటికల్లో కూరగాయాలు, ఆకుకూరలను పండించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని అన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

దెందులూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ, పదాయి బీ శిక్షణ తరగతులను పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి ప్రారంభించారు. గురువారం పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో సెక్టర్ పరిధిలో కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. పథకం లక్ష్యాలను వివరించారు.